రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# తయారీ ఖర్చు 500 అమ్మేది 2వేలు



స్వాధీనం చేసుకున్న నకిలీ పత్తి విత్తనాలు

## నకిలీ పత్తి విత్తనాల దందా ముఠా గుట్టురట్టు చేసిన పరిగి పోలీసులు

### రూ. 35 లక్షల విలువైన 23 క్వింటాళ్ల విత్తనాలు స్వాధీనం

**పరిగి, జూన్ 22 ప్రభాతవార్త:** కేవలం రూ. 500 ఖర్చుతో నకిలీ విత్తనాలు తయారు చేయడం, వాటిని అమాయక రైతులకు రూ. 1500 నుండి రూ. 2000 వరకు విక్రయించి భారీగా లాభాలు గడించడమే లక్ష్యంగా సాగుతున్న ఒక పెద్ద నకిలీ విత్తనాల దందా ముఠాను పరిగి పోలీసులు, టాస్క్ ఫోర్స్ అధికారులు కాపు కాసి పట్టుకున్నారు. సోమవారం పరిగి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఈ దందాకు సంబంధించిన సంచలన వివరాలను వెల్లడించారు. జిన్నింగ్ మిల్లుల ద్వారా నకిలీ తయారీ పోలీసుల విచారణలో తేలిన వివరాల ప్రకారం.. మునగారి హన్మయ్య (అలియాస్ పెంటప్ప), సులేగం నరేందర్ (అలియాస్ రాజు) అనే వ్యక్తులు రైతుల నుండి పత్తిని కొనుగోలు చేశారు. ఆ పత్తిని కర్ణాటకలోని జిన్నింగ్ మిల్లుకు తరలించి, అక్కడ గుట్టుచప్పుడు కాకుండా నకిలీ పత్తి విత్తనాలను తయారు చేయించారు. ఈ నకిలీ విత్తనాల తయారీకి వీరికి కిలోకు కేవలం రూ. 500 మాత్రమే ఖర్చయింది. అయితే, ప్రస్తుత సాగు సీజన్‌లో అమాయక రైతులే టార్గెట్‌గా, అధిక లాభాలు పొందడం కోసం ఒక్కో కిలోను రూ. 1500 నుండి రూ. 2000 వరకు విక్రయించడానికి సిద్ధపడ్డారు. ఎక్కువ డబ్బు ఆశ చూపి నెట్‌వర్క్ విస్తరణ ఈ నకిలీ విత్తనాలను మార్కెట్లో విక్రయించడానికి నిందితులు ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారు. హాకీంపేట్ గ్రామానికి చెందిన మల్లేష్, మద్దూర్ గ్రామానికి చెందిన నరేందర్, చింతలదేవి గ్రామానికి చెందిన మల్యాద్రిలకు.. ఈ విత్తనాలు అమ్మితే భారీగా డబ్బులు ఇస్తామని ఆశ చూపి తమ బృందంలో చేర్చుకున్నారు. వీరంతా కలిసి అక్రమంగా విత్తనాలను విక్రయించే ప్రయత్నాలు ప్రారంభించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లే స్థావరం తయారు చేసిన నకిలీ విత్తనాలను నిందితులు తుంకులగడ్డలోని ఒక ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్ ఇంట్లో దాచిపెట్టారు. అక్కడ నుండి సంచులలో నింపి, విక్రయించడానికి మోటార్ సైకిల్‌పై తరలిస్తుండగా పోలీసుల ప్రత్యేక డ్రైవ్‌లో దొరికిపోయారు. హన్మయ్య ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు నాదెండ్ల నరసింహం అనే మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని విచారించారు.

నిందితులకు రిమాండ్

ఒదితుల నుండి సుమారు రూ. 35 లక్షల విలువైన 23 క్వింటాళ్ల (53 బస్తాలు) నకిలీ పత్తి విత్తనాలతో పాటు, రవాణాకు ఉపయోగించిన ఒక మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

**పిడి యాక్ట్ నమోదు చేస్తాం: ఎస్పీ**

రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయి. అవసరమైతే అలాంటి వారిపై పిడి యాక్ట్‌కింద కేసులు పెడతాం అని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా హెచ్చరించారు. అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ప్రతిభ కనబరిచిన డీఎస్పీ అంజయ్య, సీఐ కొండల్ రెడ్డి, టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ అన్వర్ పాషా, ఎస్ఐ మోహనకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుళ్లు సురేష్, రమేష్, చిన్నయ్యలను అభినందించారు.

## ధాన్యం సేకరించి 13 రోజులవుతున్నా బిల్లులు ఇవ్వలేదు

**ఘట్‌కేసర్, జూన్ 22, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ తిరుమలయ్యబండ ధాన్యం కొనుగోలు కేంద్రంలో 979 బస్తాల వడ్లను ఘట్‌కేసర్ సహకార సొసైటీ సేకరించి 13 రోజులు గడుస్తున్నా అధికారులు బిల్లులు చెల్లించడం లేదని రైతులు సాల్వేరు వెంకటేశం, సాల్వేరు పాండులు సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎదులాబాద్‌లో పలువురు భూయాజమానుల వద్ద 17 ఎకరాల వ్యవసాయ పొలాలు కౌలుకు తీసుకొని వరిపంట సాగు చేశామని వారు తెలిపారు. పండించిన పంటను కాంటాలో విక్రయించగా ఏగ్రేడ్ రకానికి బదులుగా బిగ్రేడ్ ధాన్యంగా సెంటర్ సిబ్బందది తప్పుగా నమోదు చేశారని తెలిపారు. క్వింటాల్‌కు అరకిలో చొప్పున ధాన్యం కొత విధిస్తున్నారని ఎఫ్‌సిఐ నిబంధల ప్రకారం 40 కిలోలకు 600 గ్రాములు తీసుకోవాల్సి ఉండగా 41 కిలో 200 గ్రాములు అదనంగా 600 గ్రాములు సేకరిస్తున్నారని తెలిపారు. పండించిన ధాన్యంకు సంబంధించి ఇప్పటికి డబ్బులు తమ ఖాతాలో జమచేయలేదని పంట కౌలుకు తీసుకొని ఆరు నెలలు అవుతుందని యూజమానులు కౌలు డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు.

# స్వామి భూములు శ్రీమతికి నైవేద్యం?

ధర్మన్నగూడలో అధర్మం!



ధర్మన్నగూడ గ్రామంలో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం

### ఓ మాజీ ప్రజా ప్రతినిధిపై గ్రామస్తుల తిరుగుబాటు

### దొంగచాటుగా రిజిస్ట్రేషన్ చేయించారని ఆవేదన

### చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ డిమాండ్

### భూమి దేవునికి దక్కేంత వరకు న్యాయపోరాటం చేస్తామని హెచ్చరిక

**యాచారం, జూన్ 22, ప్రభాతవార్త:** ధర్మన్నగూడ గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ భూమి ప్రైవేట్ వ్యక్తుల కబ్జాకు గురైందనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. యాచారం మండల పరిధిలోని ఈ ఆలయానికి చెందిన సర్వే నెంబర్ 98/2లో ఉన్న 3 ఎకరాల భూమిని ధర్మన్నగూడ మాజీ ప్రజా ప్రతినిధి ఒకరు కాజేశారని స్థానికంగా తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయ పార్టీ అండదండలతో 2004వ సంవత్సరంలోనే (సుమారు 20 సంవత్సరాల క్రితం) ఆ మాజీ ప్రజా ప్రతినిధి దొంగచాటుగా ఈ ఎండోమెంట్ భూమిని తన భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని దేవాదాయ పరిరక్షణ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూకబ్జాపై స్పందించిన కమిటీ సభ్యులు, సోమవారం నాడు సదరు భూమి వద్ద ఈ మూడు ఎకరాల భూమి అమ్మబడదు, కొనబడదు, ప్రైవేట్ వ్యక్తులు ఎవరూ దీనిని సాగు చేయకూడదు అని పేర్కొంటూ ఒక ఫ్లెక్సీ నోటీసును అతికించారు. ఈ సందర్భంగా దేవాదాయ పరిరక్షణ కమిటీ గ్రామ అధ్యక్ష కార్యదర్శులు బండ మల్లేష్, మండల సత్యనారాయణ మాట్లాడుతూ.. రికార్డుల ప్రకారం లక్ష్మీ నరసింహ స్వామి వారి పేరు మీద ఉన్న ఈ భూమిని అక్రమంగా లాక్కున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెవిన్యూ ఎండోమెంట్ అధికారులు తక్షణమే స్పందించి, ఆలయ భూమిని స్వాధీనం చేసుకుని తిరిగి స్వామివారి పేరు మీదికే మార్చాలని కోరారు.

ఈ భూమి దేవునికి దక్కేంత వరకు గ్రామ ప్రజలం దరితో కలిసి న్యాయపోరాటం చేస్తామని, మాజీ ప్రజాప్రతినిధి తక్షణమే ఈ మూడు ఎకరాల భూమిని న్యాయబద్ధంగా దేవునికి అప్పగించాలని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు మల్లారెడ్డి, కోశాధికారి పట్లూరి శశిధర్ రెడ్డి, సలహాదారులు మండల నర్సింహా, మండల జంగయ్య, అలాగే సురేష్ చారి, మండల గోపాల్ కృష్ణ, బుర్రి నరేష్, హనుమండ్ల యాదగిరి తదితర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆలయ భూమిలో క్రయవిక్రయాలు నిషేధం, ప్రైవేట్ వ్యక్తులు సాగు చేయకూడదు అంటూ ఫెక్సీలు అంటిస్తున్న దేవాదాయ పరిరక్షణ కమిటీ సభ్యులు



మండల పరిషత్ కార్యాలయ భవన ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

## ప్రజా సేవలో అలసత్వాన్ని ఉపేక్షించను

### అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

**కడ్తాల్, జూన్ 22, ప్రభాతవార్త:** కడ్తాల్ మండల కేంద్రంలో సరికొత్త మైలురాయి నమోదైంది. సుమారు కోటి రూపాయల భారీ వ్యయంతో, అన్ని రకాల ఆధునిక వసతులతో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ మల్లురవి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు ఆసిఫ్ ఆలీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క కార్యాలయంలోని వివిధ విభాగాలను కలియతిరిగి పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందాలన్నారు. ప్రజా సేవలో ఎలాంటి నిరక్ష్యాన్ని సహించేది లేదని అధికారులను గట్టిగా హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని మంత్రి స్పష్టం చేశారు.

**రూ. 100 కోట్ల నిధులు కావాలి : ఎమ్మెల్యే కసిరెడ్డి**

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని తండాలు, గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బీటీ రోడ్ల నిర్మాణానికి అత్యవసరంగా మరో రూ. 100 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మంత్రి సీతక్కను వేదికపైనే కోరారు.

**నెలకు రూ. 6,000 కోట్ల వడ్డీలు కడుతున్నాం: ఎంపీ మల్లురవి**

ఎంపీ మల్లురవి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం చేసిన రూ. 8 లక్షల కోట్ల అప్పుల వల్ల, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు రూ. 6,000 కోట్ల కేవలం వడ్డీల రూపంలోనే చెల్లించాల్సి వస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. సభలో అదనపు కలెక్టర్ కిరణ్మయి, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీఆర్డీఓ శ్రీలత, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలాలలో నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం

# జవహర్ నగర్‌లో జెసిబి గర్జన

**✦ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ కన్నెర్ర ✦అనుమతులు లేకపోతే కూల్చివేతలే ✦భవిష్యత్తులో కఠిన చర్యలు ఉంటాయని కబ్జాకోరులకు అధికారుల హెచ్చరిక**

**జవహర్ నగర్, జూన్ 22 ప్రభాతవార్త:** జవహర్‌నగర్ ప్రాంతంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు సోమవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు గిర్దావర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బాలాజీనగర్, వికలాంగుల కాలనీ ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలను అధికారులు పరిశీలించారు. అక్కడ అక్రమంగా ఆక్రమించి నిర్మించిన పలు కట్టడాలను జేసీబీ సాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమించి, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం రెవెన్యూ శాఖ ప్రాథమిక బాధ్యత అని, ప్రజలు ఎవరూ ప్రభుత్వ స్థలాలపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే కూల్చివేతలు కూడా ఇలాగే కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల రక్షణకు రెవెన్యూ శాఖ నిరంతరం కట్టుబడి పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఇటీవల పలు పత్రికల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు సంబంధించిన కథనాలు ప్రచురితమైన నేపథ్యంలోనే అధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వ భూములపై ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపట్టాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

## ప్రజావాణి దరఖాస్తులపై జాప్యం వద్దు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 22, ప్రభాతవార్త :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఎలాంటి జాప్యం చేయకుండ వెంటనే పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ దరఖాస్తులను స్వీకరించారు. దీనిలో డిఆర్ఓ మాలతి, హౌజింగ్‌పిడి రమణమూర్తి,పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి ప్రజావాణిలో 106 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగ ప్రజలు కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకంతో వస్తారని, ప్రజావాణిలో వారు అందజేసిన ధరఖాస్తులను, వినతులను, ఫిర్యాదులను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి ఎలాంటి జాప్యం లేకుండ పరిష్కరించటానికి తగు చర్యలు చేపట్టాలన్నారు. తిరస్కరించే దరఖాస్తులకు గల కారణాలను తప్పనసరిగా వివరంగా ఆర్జీదారులకు తెలియజేయాలన్నారు.

# డబుల్ ఓట్లకు చెక్

**★రెండు చోట్ల ఓటు ఉంటే నోటీసులు ★మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరి హెచ్చరిక ★ఓటర్ల ఎన్యుమరేషన్ ప్రక్రియపైనా కీలక ఆదేశాలు ★రాజకీయ పక్షాలతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 22, ప్రభాతవార్త:** ఓటర్ల జాబితాలో అక్రమాలకు తావులేకుండా, పారదర్శకతను పెంచేందుకు మేడ్చల్ జిల్లా యంత్రాంగం కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. రెండు వేర్వేరు ప్రాంతాల్లో డబుల్ ఎన్‌రోల్మెంట్ (రెండు చోట్లా ఓటు హక్కు) కలిగి ఉన్న ఓటర్ల ఆటకట్టించేందుకు కలెక్టర్ మను చౌదరి కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాంటి ఓటర్లను తక్షణమే గుర్తించి, వారికి నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి వచ్చే అభ్యర్థనలను పరిశీలించి, చట్టప్రకారం వారు కోరుకున్న ఏదో ఒక చోట మాత్రమే ఓటు హక్కు కొనసాగేలా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్లోని విసి హాల్లో అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డితో కలిసి ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఓటర్ల ఎన్యుమరేషన్ ప్రక్రియను పక్కాగా పూర్తి చేసేందుకు యంత్రాంగం ముమ్మర చర్యలు చేపట్టిందని, ఎన్యుమరేషన్ పత్రాలు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ అందేలా చూడాల్సిన బాధ్యత పార్టీల ప్రతినిధులపై ఉందని సూచించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు త్వరలోనే బూత్ స్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

**వారం రోజుల్లోగా ఫారాల సమర్పణ**

ప్రతిరోజు సుమారు 30 ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, వాటిని పూర్తిగా భర్తీ చేసి తిరిగి అందించేందుకు ఓటర్లకు ఒక వారం రోజుల గడువు ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

**ఓటర్ల నమోదుకు సరికొత్త నిబంధనలు**

ఎలక్టోరల్ లిస్టులో మ్యాపింగ్ కాని ఓటర్ల నమోదుకు సంబంధించి కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. 1987కి ముందు జన్మించిన వారు తమ గుర్తింపు కోసం ఎస్ఎసిసి మెమో, ఇంటర్మీడియట్ మెమో లేదా కుల ధృవీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

1987 నుంచి 2004 సంవత్సరాల మధ్య జన్మించిన ఓటర్లు తమ తల్లిదండ్రులు ఇద్దరి గుర్తింపు కార్డుల నకళ్లను జత చేస్తూ బిఎల్‌ఎలకు ఎన్యుమరేషన్ ఫారాలను అందించాలని, ఇప్పటికే మ్యాపింగ్ పూర్తయిన ఓటర్లు ఎలాంటి పత్రాలు ఇవ్వనవసరం లేదని, కేవలం ఫారాలపై సంతకం చేసి ఇస్తే సరిపోతుందని కలెక్టర్ వివరించారు. ఈ ప్రాధాన్యత కలిగిన ఆల్ పార్టీ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో పాటు వివిధ రాజకీయ పార్టీల ముఖ్య ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




అఖిలపక్ష పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

# నివాసాల మధ్యే డేంజర్ జోన్..

**యాచారం, జూన్ 22, ప్రభాతవార్త:** యాచారం మండలం తాడిపర్తి గ్రామంలో ఎప్పుడు ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయాందోళనల మధ్య స్థానిక ప్రజలు కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామంలోని నివాసాల మధ్య, ఇళ్లపై నుండి విద్యుత్ తీగలు అత్యంత ప్రమాదకరంగా వేలాడుతుండటమే ఇందుకు కారణం. ముఖ్యంగా వర్షాకాలం వచ్చిందంటే చాలు.. ఇక్కడి ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈదురు గాలులు వీచిన ప్రతిసారీ ఈ హైవోల్టేజ్ విద్యుత్ తీగలు ఊగుతూ ఇళ్లకు ఆనుకుంటున్నాయి. దీంతో ఎప్పుడు ఇళ్లు విద్యుత్‌ఘాతానికి గురవుతాయో, ఏ క్షణంలో ఏ చిన్నారి ప్రాణాలు గాల్లో కలుస్తాయోనని కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు.

**తాడిపర్తికి హైటెన్షన్**

**గాల్లో ఊగుతూ ఇళ్లకు తాకుతున్న హైవోల్టేజ్ తీగలు.. చిన్న పిల్లల ప్రాణాలకు ముప్పు ఉందని స్థానికుల ఆందోళన అధికారులు పట్టించుకోవటంలేదని ఆగ్రహం అధికారుల మొద్దునిద్ర వీడకుంటే విద్యుత్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరిక**

ఈ సమస్యపై గ్రామస్తులు గతంలో అనేకమార్లు విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ తిరిగి, మొరపెట్టుకున్నారు. అయినా సరే, ఎలాంటి చలనం లేదు సరికదా.. కనీసం వచ్చి పరిశీలించిన పాపాన కూడా పోలేదు.

**ప్రాణనష్టం జరిగితనే అధికారులదే బాధ్యత**

ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు తమ మొద్దునిద్ర వీడి, తక్షణమే స్పందించి ఈ ప్రమాదకర తీగలను ఇళ్లకు దూరంగా సరిచేయాలని గ్రామ ప్రజలు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాగే నిరక్ష్యం వహిస్తే మాత్రం చూస్తూ ఊరుకునేది లేదని, గ్రామస్తులందరినీ సమీకరించి విద్యుత్ శాఖ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నాకు దిగు తామని హెచ్చరిస్తున్నారు. భవిష్యత్తులో ఇక్కడ ఎలాంటి ప్రమాదం జరిగినా, ఎవరి ప్రాణ నష్టం సంభవించినా దానికి పూర్తి బాధ్యత విద్యుత్ అధికారులదేనని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఉన్నతా ధికారులు జోక్యం చేసుకుని, యుద్ధప్రా తిపదికన ఈ సమస్యను పరిష్కరించి తమ ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు



హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి

## నాలా కబ్జాలపై చర్యలు తీసుకోండి

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 22, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ పరిధిలోని జోడిమెట్ల చౌరాస్తా వద్ద మేదా కంపెనీ ఎదురుగా నాళాలలను కబ్జాచేసి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను ఆపి నాళా కబ్జాకాకుడా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి తెలిపారు.

సోమవారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని హైడ్రా కార్యాలయంలో నాళాలల కబ్జాపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోచారం పరిధిలోని వివిధ కాలనీల నుండి వచ్చే వర్షపునీరు ప్రవహించే నాళాలపై నుండి కొందరు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. దీంతో నాలా ముసుకుపోవడంతో మురుగునీటితో పాటు వర్షపునీరు ప్రవహించే దారిలేక వర్షపునీరు ఇండ్లల్లోకి చేరే అవకాశముందని తెలిపారు. వెంటనే నాలాలపై నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్బవతి నర్సింహ, హిమగిరి కాలనీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాములు, పోచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యాలాల ఆర్ఐకి మెమో

### ఇసుక వేలంలో అక్రమాలపై చర్యలు

**'వార్త' కథనాని స్పందన**

**యాలాల జూన్ 22,ప్రభాతవార్త :**'లక్షల విలువైన ఇసుక...రహస్య వేలం' అనే శీర్షికతో సోమవారం ప్రచురితమైన వార్తా కథనానికి స్పందించిన అధికారులు ఆర్ఐ చరణ్‌కుమార్‌పై చర్యలు తీసుకున్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న ఇసుకను బహిరంగ వేలం వేయడంలో పొరపాట్లు జరిగిన విషయం వాస్తవమేనని,అందుకు భాద్యుడైన ఆర్ఐ చరణ్‌కుమార్‌కు మెమో జారీ చేస్తామని తహశీల్దార్ గాయత్రి సోమవారం వెల్లడించారు.ఇక ముందు ఇలాంటి వ్యవహారాల్లో నిబంధనలు ఖచ్చితంగా పాటించేలా చూసుకుంటానని ఆమె స్పష్టం చేశారు. ఆర్ఐపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యాలాల మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు తహసీల్దార్‌కు పిర్యాదు చేశారు.

## టిబి రహిత సమాజమే లక్ష్యం

**పెద్దేముల్, జూన్ 22, ప్రభాత వార్త:** ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన 99వ రోజు కార్యక్రమాల్లో భాగంగా, పెద్దేముల్ మండల పరిధిలోని ఘాజీపూర్ గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ పై అవగాహన సదస్సు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ పట్లోళ్ల హేమలత లాల్ రెడ్డి మాట్లాడుతూ, క్షయ (టీబీ) వ్యాధి పట్ల ప్రజలు నిరక్ష్యం వహించవద్దని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని సూచించారు. వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, పరీక్షలు చేయించుకోవడం ద్వారానే వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ శిబిరంలో పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ శ్వేత ఆధ్వర్యంలో గ్రామస్తులకు విస్తృతమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి 140 మంది గ్రామస్తులు హాజరుకాగా, వారిలో 74 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. ఒకవేళ ఎవరికైనా టీబీ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే, వారికి ప్రభుత్వం తరఫున ఉచితంగా మందులు అందజేస్తామని వైద్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యులు ప్రమోద్ కుమార్, ఎం.ఎల్.హెచ్.పి అశోక్ రెడ్డి, ఏఎన్ఎం నర్సుబాయ్, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### జర్నలిస్టులందరికి అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి

..మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 22, ప్రభాతవార్త:** జిల్లాలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని జిల్లా జర్నలిస్టు సంఘం పలువురు నాయకులు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాల్‌రాజ్‌తో కలిసి పలువురు జర్నలిస్టులు కలిసి అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా టియుడబ్ల్యుజె-ఐజెయు అధ్యక్షులు గడ్డమీది బాల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లా అర్బన్ జిల్లా కావటంతో ప్రధాన పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలలో ప్రతి మండలంలో ఇద్దరు కంటే ఎక్కువ మంది విలేకరులు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. అక్రిడేషన్ జీఓ 252మేరకు మండలానికి ఒక అక్రిడేషన్ ఇచ్చే అవకాశం ఉన్నందున ఇతరులు నష్టపోయే ప్రమాదం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లటం జరిగిందన్నారు. ప్రధాన పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందన్నారు. మీడియా సంస్థలు ఇచ్చిన సిఫార్సు లేఖల్లో పేర్లు కలిగి ఉండి జీఓ మేరకు అర్హులు కాని వారిని గుర్తించి తగిన న్యాయం చేయాలని కోరారు. దీంతో జిల్లా జర్నలిస్టులకు న్యాయం చేసిన వారు అవుతారని ఆయనతో పాటు పలువురు కోరారు. దీనికి జిల్లా కలెక్టర్ మనుచౌదరి స్పందిస్తూ జిల్లాలో అక్రిడేషన్‌ల అంశంలో అన్యాయం జరగకుండ చూస్తామని కలెక్టర్ స్పష్టం చేసినట్లు వారు తెలిపారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించి కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాంరెడ్డి, పలువురు జిల్లా జర్నలిస్టు నాయకులు అందరు పాల్గొన్నారు.

### డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను పారదర్శకంగా పంపిణీ చేయాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 22, ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను పారదర్శకంగా పంపిణీ చేయాలని కోరుతూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరిని జిల్లాకు చెందిన ఐదుగురు (బిఆర్ఎస్) ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకా నంద, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కలిసి విచ్చేసి జిల్లాకలెక్టర్ మనుచౌదరిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. డబుల్‌బెడ్‌రూమ్ కాలనీల వద్ద అవ కతవకలు జరుగుతున్నట్లు, దళారులు వ్యవస్థ కొనసాగుతుందని ఈ విషయంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ వారు అందరు కలిసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద మాట్లాడుతూ జిల్లాలో డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల కాలనీల్లో పంపిణీ విషయంలో కాంగ్రెస్ నాయకులు దళారులుగా అవతారం ఎత్తుతున్నారని, వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ఈ పద్ధతిలో కొనసాగిస్తే మాత్రం బిఆర్ఎస్ ఉద్యమాలు చేయక తప్పదని ఆయన హెచ్చరించారు. బిఆర్ఎస్ హాయంలో జిల్లాలో డబుల్‌బెడ్‌రూమ్‌లను (ఇండ్లను) నిర్మించటం జరిగిందని, నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లలో ఇంకా 6,500ఇండ్లు పంపిణీ పూర్తి కావలసి ఉందన్నారు. వీటిని పారదర్శకంగా పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరటం జరిగిందన్నారు.



మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ జిల్లా కలెక్టర్ మనుచౌదరిని

ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో ఘోరంగా విఫలమైనట్లు ఎమ్మెల్యే వివేకానంద విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 20లక్షల ఇళ్లు నిర్మించిన తరువాతనే ఓట్లు అడుగుతామని అన్నారని, ఇచ్చిన మాట మీద నిలబడుతారా అని కాంగ్రెస్ నాయకులకు సవాల్ చేశారు. ఎన్నికల ముందు పెన్షన్లు రూపాయలు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చాక మాట దాట వేసిందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో 19లక్షల ఫించన్ల ధరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు ఎమ్మెల్యే వివేకానంద తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు (బిఆర్ఎస్) సిహెచ్ మల్లారెడ్డి, కెపి వివేకానంద, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాదవరం కృష్ణారావు, బి.లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొన్నారు.

### లక్ష్మాపూర్ మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణంకు విరాళం

**శామీర్‌పేట, జూన్ 22, ప్రభాతవార్త:**

లక్ష్మాపూర్ మున్నూరుకాపు సంఘం భవన నిర్మాణం అసంపూర్తిలో ఉన్నందున ఆ సంఘం నాయకుల విన్నపం మేరకు రాష్ట్ర, జిల్లా సంఘం ఎన్నికల నిర్వాహణ అధికారి ఆకుల సత్యనారాయణపటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగ్‌రావుపటేల్‌లు ఆ సంఘంనకు 30వేల రూపాయలు ఆర్థిక సహాయంను అందజేశారు. అలియాబాద్ చౌరస్తా వద్ద జరిగిన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మున్నూరుకాపు సమావేశం తరువాత రాష్ట్ర మున్నూరుకాపు కార్పోరేషన్ ఛైర్మన్ బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి పటేల్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తంపటేల్, జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్‌ల సమక్షంలో లక్ష్మాపూర్ మున్నూరుకాపు సంఘానికి ఆర్థిక సహాయంను వారు అందజేశారు. త్వరగా సంఘం భవన నిర్మాణంను పూర్తి చేసుకోవాలని సూచించారు. దీనికి ముందుగా మున్నూరుకాపు సంఘం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఆత్మీయ సమావేశం జిల్లా అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్‌పటేల్ ఆధ్వర్యంలో వారు పాల్గొన్నారు. మున్నూరుకాపు సంఘం బలోపేతంకు రాజకీయాలకు అతీతంగా ఐక్యతతో ఉంటూ పనిచేద్దామని రాష్ట్ర మున్నూరుకాపు కార్పోరేషన్ ఛైర్మన్ బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా, మండల మున్నూరుకాపు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'వార్త' కథనానికి స్పందన

-ఇసుక వేలంలో అక్రమాలకు పాల్పడిన ఆర్ఐకి మెమో-తహశీల్దార్ గాయత్రి వెల్లడి

**యాలాల జూన్ 22,ప్రభాతవార్త :** 'లక్షల విలువైన ఇసుక…రహస్య వేలం' అనే శీర్షికతో సోమవారం ప్రచురితమైన వార్తా కథనానికి స్పందించిన అధికారులు ఆర్ఐ చరణ్‌కుమార్‌పై చర్యలు తీసుకున్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న ఇసుకను బహిరంగ వేలం వేయడంలో పొరపాట్లు జరిగిన విషయం వాస్తవమేనని, అందుకు బాధ్యుడైన ఆర్ఐ చరణ్ కుమార్‌కు మెమో జారీ చేస్తామని తహశీల్దార్ గాయత్రి సోమవారం వెల్లడించారు. ఇక ముందు ఇలాంటి వ్యవహారాల్లో నిబంధనలు ఖచ్చితంగా పాటించేలా చూసుకుంటానని ఆమె స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఇసుక వేలంలో అక్రమాలకు పాల్పడిన ఆర్ఐపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యాలాల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు తహశీల్దార్‌ను కలిసి మౌఖికంగా పిర్యాదు చేశారు. ఇసుక వేలంలో ఏకపక్షంగా వ్యవహరించడంపై వారు తహశీల్దార్‌ను ప్రశ్నించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



## ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులు పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి

**తలకొండపల్లి జూన్18,ప్రభాత వార్త;**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను ఈరోజు గౌరవ ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో క్షుణ్ణంగా పరిశీలించారు. భవిష్యత్ తరాలకు ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ మహత్తర సంకల్పానికి ప్రతీకగా రూపుదిద్దుకుంటున్న ఈ విద్యా ప్రాంగణం నిర్మాణ పురోగతిని ఆయన స్వయంగా సందర్శించి సమీక్షించారు. ఈ సందర్భంగా సైట్ ఇంజనీర్లు, సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి మొత్తం ప్రాజెక్టు ప్రాంతాన్ని విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే గారు, పాఠశాల భవనాలు, అత్యాధునిక తరగతి గదులు, విద్యార్థుల హాస్టళ్లు, సైన్స్ మరియు కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, డైనింగ్ హాల్స్, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య వ్యవస్థల తదితర అన్ని నిర్మాణ పనులను లే అవుట్ చిత్రంలో అంచనా వేస్తూ నిశితంగా పరిశీలించారు. ప్రతి పనికి సంబంధించిన సాంకేతిక వివరాలను తెలుసుకుంటూ, నిర్మాణ నాణ్యత, భద్రతా ప్రమాణాలు మరియు పనుల వేగంపై ప్రత్యేక దృష్టి సారించారు.

ఈ ప్రాజెక్టు కేవలం ఒక పాఠశాల నిర్మాణం మాత్రమే కాదని, గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర విద్యా యజ్ఞమని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవ రేవంత్ రెడ్డి గారి కలల ప్రాజెక్టుగా రూపొందుతున్న ఈ విద్యాసంస్థ విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాల విద్యతో పాటు ఆధునిక వసతులు, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన అన్ని అవకాశాలను కల్పించనుందని తెలిపారు.

పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేసిన ఎమ్మెల్యే గారు, ప్రతి నిర్మాణం దీర్ఘకాలికంగా నిలిచేలా అత్యుత్తమ ప్రమాణాలతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్ణయించిన గడువుకంటే ముందుగానే పనులు పూర్తి చేసే దిశగా కృషి చేయాలని, ఎక్కడైనా జాప్యం లేదా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించి నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

ఖానాపూర్‌లో నిర్మితమవుతున్న ఈ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవిష్యత్తులో రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన విద్యా కేంద్రంగా నిలవడంతో పాటు వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపే జ్ఞాన మందిరంగా అవతరించనుందని ఎమ్మెల్యే గారు ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యా రంగంలో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలబెట్టే దిశగా ప్రభుత్వం చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన సూచించారు. పర్యటన ముగింపులో నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, నాణ్యతలో రాజీ లేకుండా, పారదర్శకతతో నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని అధికారులను అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే గారు, "నేటి విద్యార్థులే రేపటి భారత నిర్మాణ శిల్పులు" అని పేర్కొంటూ ఈ ప్రాజెక్టు విజయవంతం కావడం ద్వారా ప్రాంత విద్యా అభివృద్ధిలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమవుతుందని అన్నారు.

## విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**శంషాబాద్ జూన్22,ప్రభాతవార్త :** మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని డిసిపి రాజేష్,ఏసిపి శ్రీకాంత్‌లు పేర్కొన్నారు. సోమవారం శంషాబాద్‌లోని అకాంప్లిష్ అకాడమీలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి అకాంప్లిష్ అకాడమీ ఛైర్మన్ డి. బుచ్చిరెడ్డి అధ్యక్షతను వహించగా ముఖ్య అతిథులుగా డిసిపి రాజేష్, ఏసిపి శ్రీకాంత్, ఎస్‌హెచ్ఓబి సంజీవ్ హాజరై విద్యార్థులకు సమాజంలో ప్రస్తుతం ఎదురవుతున్న పలు సవాళ్లు, భద్రతా అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా డ్రగ్స్ దుర్వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక మరియు సామాజిక నష్టాల గురించి వివరించి, యువత అలాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ… రోడ్డు భద్రతపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిసిపి రాజేష్,ఏసిపి శ్రీకాంత్,ఎస్‌హెచ్ఓబి సంజీవ్

కల్పిస్తూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో సీట్ బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలు మరియు చట్టపరమైన పరిణామాలను వివరించారు. సైబర్ సెక్యూరిటీ అంశంపై మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, బలమైన పాస్‌వర్డ్‌ల ప్రాముఖ్యత, వ్యక్తిగత సమాచారం గోప్యతను కాపాడుకోవడం వంటి అంశాలపై సూచనలు అందించారు. మొబైల్ ఫోన్లను విద్యా ప్రయోజనాలకు వినియోగించాలని, అధికంగా వినియోగించడం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ఆన్‌లైన్ మోసాల గురించి ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తూ ఓటిటి మోసాలు, ఫేక్ లింకులు, నకిలీ వెబ్‌సైట్లు మరియు ఆన్‌లైన్ లావాదేవీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రత్యక్ష ఉదాహరణలతో వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, డ్రగ్స్ బెడద పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అనుమానాస్పద కాల్స్, సందేశాలు లేదా ఆన్‌లైన్ మోసాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, ఎంఈఓ

### సందడిగా సామూహిక అక్షరాభ్యాసం

**షాద్‌నగర్, జూన్ 22, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు జీడివడక తండాలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బడిబాట మరియు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మండల విద్యాధికారి (ఎంఈఓ) మనోహర్, పార్టీ అధినేత పాతూరి వెంకట్రావు, సామాజికవేత్త పినపాక ప్రభాకర్ హాజరై విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, తల్లి దండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాల లకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో నగర వాసులు పాతూరు వెంకట్రావు, పినపాక ప్రభాకర్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. విద్యార్థుల అక్షరాభ్యాసం నిర్వహించి, వారి విద్యాభ్యాసానికి శుభాకాంక్షలు తెలిపారు.

### పాఠశాలల ప్రగతికి పెద్దపీట

**నందిగామ, జూన్ 22, ప్రభాతవార్త :** నందిగామ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఎంఎస్ఎన్ తండాలో ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి సర్పంచ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్ లు సోమవారం 13 వ వార్డు సభ్యుడు లింగం నాయక్ ఆధ్వర్యంలో సోమవారం భూమి పూజ చేశారు. ఈ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అన్ని పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివే విధంగా తల్లిదండ్రులకు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ ఏఎంసి డైరెక్టర్ సి నర్సింలు, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, శివగళ్ళ ప్రవీణ్, బొమ్మగళ్ళ నర్సింలు, టైలర్ కృష్ణ, నాయకులు మురళి, చిరసాని నరసింహులు, కేశమోని రామచంద్రి, బాలు నాయక్, గోవింద్ నాయక్, సోమ్లా నాయక్, పాఠశాల ఉపాధ్యాయురాలు దీప్తి తదితరులున్నారు.



తూంకుంటలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి,పాల్గొన్న తదితరుల

### తూంకుంట పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలన

**శామీర్‌పేట, జూన్ 22, ప్రభాతవార్త:** తూంకుంటలోని ప్రాథమిక పాఠశాలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న మధ్యాహ్న భోజనంను మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. సోమవారం శామీర్‌పేట డివిజన్ పరిధిలోని తూంకుంటలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం తయారును విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని స్వయంగ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం నాణ్యతను, రుచి, పరిశుభ్రత వంటి వాటిపై ఆరా తీశారు.

ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు జైపాల్‌రెడ్డి సూచించారు. మధ్యాహ్న భోజనం పథకం విద్యార్థుల ఆరోగ్యంకు, విద్యార్థులకు హాజరు పెంపునకు దోహదపడుతుందన్నారు. భోజనం తయారీలో పరిశుభ్రతను పాటించాలని వారికి సూచించారు. దీనిలో ఆయనతో పాటు నాయకులు కత్త రమేశ్ పాల్గొన్నారు.

## బాలుడి హత్య కేసులో ఇద్దరు నిందితుల రిమాండ్

-అక్రమ సంబంధానికి అడ్డువస్తున్నాడని తల్లి ఘాతుకం

**కీసర, జూన్ 22, ప్రభాతవార్త:** అక్రమ సంబంధం నేపథ్యంలో ఓతల్లి ప్రియుడితో కలిసి తన కుమారుడిని హత్యకు పాల్పడింది. కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈహత్యకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం కోర్టుకు రిమాండ్ చేశారు. కీసర పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జవహర్‌నగర్ ఏసిపి చక్రపాణి, ఇన్‌స్పెక్టర్ అంజనేయులు హత్య కేసు నిందితులను చూపుతూ వివరాలను వెల్లడించారు. కీసర మండలం చీర్యాలకు చెందిన క్యాబ్ డ్రైవర్ రంగాస్వామి (33) తన భార్య జ్యోతి (23), కుమారుడు హరికృష్ణ (2)తో కలిసి ఈడెన్ గార్డెన్స్‌లో ఉంటున్నాడు. గత మే నెల 29వ తేదీన తన కుమారుడు హరికృష్ణ కింద పడి పోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడని రంగా జ్యోతి ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిక్షించి అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. కుమారుడి మృతిపై అనుమానంతో ఈనెల 13న రంగాస్వామి తన కుమారుడు హరికృష్ణ అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడని కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈకేసును మల్కాజ్‌గిరి డిసిపి శ్రీధర్ పర్యవేక్షణలో కీసర ఇన్‌స్పెక్టర్ అంజనేయులు ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి దర్యాప్తు చేసి బాలుడి హత్య కేసును చేదించారు. సీసీటీవీ ఫ్యూటేజ్, సాక్షుల వాంగ్మూలాలు సాంకేతిక ఆధారాల విశ్లేషణలో నిందితురాలు రంగా జ్యోతి నిందితుడు మొగుళ్ల నవీన్‌ల మధ్య అక్రమ సంబంధం ఉన్న ట్లు వెల్లడింది. సంఘటన జరిగిన రోజు నిందితుడు ఇంటికి వచ్చినట్లు తర్వాత బాలుడిని ఆసుపత్రికి తరలించడంలో పాల్గొన్నట్లు నిర్ధారణ అయ్యిందని తెలిపారు. అనుమానాస్పద పరిస్థితుల దృష్ట్యా ఈనెల 19న బాలుడి మృతదేహాన్ని వెలికి తీసి (ఎక్స్యూమేషన్) ఫోరెన్సిక్ పరీక్ష లు నిర్వహించగా పోస్టుమార్టం నివేదిక అందాల్సి ఉందని తెలి పారు. దర్యాప్తులో తేలిన మేరకు నిందితులు తమ అక్రమ సంబం ధానికి మృతుడు అడ్డుగా ఉన్నా డని భావించి ముందస్తుగా కుట్ర పన్ని మే 29న బాలుడిని హత్య చేసినట్లు నిర్ధారించారు. నింది తుడు బాలుడిని నేలపై బలంగా కొట్టగా నిందితురాలు ఈచర్యకు సహకరించినట్లు తేలింది. అనం తరం సంఘటనను ప్రమాదవ శాత్తు జరిగినట్లు చూపించేందుకు ఆసుపత్రికి తరలించారని పేర్కొ న్నారు. ఈకేసులో నిందితులు యాదాద్రిభువనగిరి జిల్లా తుర్క పల్లి మండలం మాధాపురంకు చెందిన ఎలక్ట్రిషియన్ మొగుళ్ల మల్లేశ్ (28), సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తేగుల్‌కు చెందిన రంగా జ్యోతి (23)లను ఆదివారం అరెస్ట్ చేసి విచారించగా నిందితులు వారు చేసిన నేరాన్ని అంగీకరించడంతో కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ చక్రపాణి తెలిపారు. కేసులో పోస్టుమార్టమ్ నివేదిక ఇతర సాక్షాల ఆధారంగా తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని ఆయన తెలిపారు.

## నేడు బిఎల్ఒలకు శిక్షణా కార్యక్రమం

-తహశీల్దార్ గాయత్రి

**యాలాల జూన్ 22,ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశాల మేరకు నేడు మంగళవారం యాలాల మండల బిఎల్ఒలకు ఎస్ఐఆర్(సర్)పై శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు యాలాల మండల తహశీల్దార్ గాయత్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు మండల కేంద్రంలోని శ్రీ పిఎం బాలర ఉన్నత పాఠశాలలో ప్రారంభమవుతోదని ఆమె తెలిపారు. బిఎల్ఒలు తప్పనిసరిగా హాజరు కావాలని, గైర్హాజరు అయితే మాత్రం కలెక్టర్‌కు రిపోర్టు చేస్తామని తహశీల్దార్ వివరించారు.

### సుప్రీక వివాహం కోసం మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ ఆర్థిక సాయం

**శామీర్‌పేట, జూన్ 22, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లి గ్రామానికి చెందిన మాధవి-రవి దంపతుల చిన్న కుమార్తె సుప్రక వివాహ ఖర్చుల కోసం సామాజిక బాధ్యతగా మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, కౌన్సిలర్ ర్యాకల నీరజ్‌గౌడ్‌లు ఆ కుటుంబం వారికి ఆర్థిక సహాయంను అందజేశారు. సోమవారం మూడుచింతలపల్లిలోని వారి నివాసంకు మున్సిపల్ చైర్మన్ జాము రవి 15వేల రూపాయలు, కౌన్సిలర్ ర్యాలక నీరజ్‌గౌడ్ 11వేల రూపాయలు ఆర్థిక సహాయంగా వారు అందజేశారు. యువతి సుప్రీక వివాహం కోసం కొంత వరకు ఆర్థికంగ ఆదుకోవటానికి ఆ కుటుంబం వారి కోరిన మేరకు వారు స్పందించి కుటుంబ సభ్యులను కలిసి ఆర్థిక సహాయంను అందజేశారు.

ఆపదలో ఉన్న కుటుంబాలకు తమ వంతు సహకారం ఉంటుం దని సామాజిక బాధ్యతగా భావిసూత కొంత మేరకు ఆర్థిక సహాయంను అందించినట్లు తెలి పారు. సుప్రీక వివాహం సుఖసంతోషాలతో జరగాలని వారు ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఆర్థిక సహాయం అందజేసిన చైర్మన్ జాము రవికి, కౌన్సిలర్ నీరజ్‌గౌడ్‌కు మాదవి-రవి దంపతులు వారికి దన్యవాదాలు తెలియజేశారు. స్థానికులు కూడ వారు వివాహం కోసం ఆర్థికంగా ఆదుకోవటాన్ని వారిని అభినందించారు.

### 'డ్రగ్స్‌కు నో చెప్పి జీవితానికి అవును చెప్పాలి'

**ఘట్‌కేసర్, జూన్ 22, ప్రభాతవార్త:** దేశ భవిష్యత్తుకు యువత వెన్నెముక్క అని మాదక ద్రవ్యాలు యువత జీవితాలను నాశనం చేస్తున్నాయని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి అన్నారు. ఘట్‌కేసర్‌లోని వివేకానంద జూనియర్ కళాశాల, కొండాపూర్‌లోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మాదక ద్రవ్యాల నివారణపై పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఎస్ఐలు బి.ప్రభాకర్‌రెడ్డి, ఏ.రాఘవేంద్రలు పాల్గొని విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కల్గే నష్టాలను తెలియజేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, క్రమ శిక్షణ, మంచి విలువలతో ముందుకు సాగాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు.

ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసుశాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు. ఈకార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఎం.హరిప్రసాద్, కె.అనిల్‌కుమార్ సమన్వయం చేశారు. విద్యార్థులు 'డ్రగ్స్‌కు నో చెప్పి జీవితానికి అవును చెప్పాలి' అనే సందేశాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లాలని ప్రతిజ్ఞ చేశారు.

### తలకొండపల్లిలో ఉప్పల ఆశ్రమ పాఠశాల ప్రారంభోత్సవం

**తలకొండపల్లి జూన్ 18, ప్రభాతవార్త:**

మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ ఛైర్మన్ మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ సమాజానికి అందిస్తున్న పలు సేవా కార్యక్రమాలు అభినందనీయమని మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. గురువారం తలకొండపల్లి మండలంలో నీ ఎక్స్ రోడ్లో నూతనంగా ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో ఉప్పల ఆశ్రమ రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభించారు. లక్షల రూపాయల ఖర్చుతో పేద పేద బాలికలకు ఆశ్రమ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మించి చదువు చాలా అభినందనీయమని కొనియాడారు. బాలికల విద్యాభివృద్ధికి ఇటువంటి విద్యాసంస్థలు ఎంతో దోహదపడతాయని విద్య సామాజిక రంగాల్లో సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ఉప్పల వెంకటేష్ సేవా కార్యక్రమాలను ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధి కోసం ఆశ్రమ పాఠశాల ఏర్పాటు అభినందనీయమని, ఎంతో ఖర్చుతో కూడుకున్న పనిని ప్రజల కోసం నిర్వహించడం చెప్పుకోదగ్గ విషయమని వారు కొనియాడారు. తల్లిదండ్రులు లేని నిరుపేద బాలికలకు స్వచ్ఛందంగా పాఠశాలతో పాటు డెన్సియల్ ఏర్పాటు చేయడం సమాజాన్ని మేల్కొల్పడమని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ టిఆర్ఎస్ ఇన్చార్జి రజిని, మాజీ ఎంపీపీలు తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్ శ్రీనివాస్ యాదవ్, రాములు, మాజీ ప్రజా ప్రతినిధులు గోపాల్ నాయక్ లలిత జోతయ్య, శేఖర్ యాదవ్, సుధాకర్, మల్లేష్, వెంకటయ్య, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, జూన్ 22, ప్రభాతవార్త:** విద్యుత్ తీగల కింద చెట్లకొమ్మలు తొలగిస్తున్న కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు తాత్కాలికంగా అంతరాయం కల్గుతుందని ఘట్‌కేసర్ సెక్షన్ ఇంచార్జ్ ఏఈ ఎం.ప్రసన్నాంజనేయులు తెలిపారు. 11 కెవి చందుపట్లగూడ ఫీడర్ పరిధిలోని ఎదులాబాద్, చందుపట్లగూడ, మర్రిపల్లిగూడ, కొత్తగూడెం, పోతరాజుగూడెం, మేఘ కళాశాల, మదర్‌థెరిస్సా కళాశాల, శ్రీరామ పౌల్ట్రీఫాంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11 కెవి ఎదులాబాద్ ఎజిఎల్ ఫీడర్ పరిధిలోని ఎదులాబాద్, కొత్తగూడెం, పోతరాజుగూడెం వ్యవసాయ కనెక్షన్లకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు, వ్యవసాయదారులు గమనించి ముందస్తు జాగ్రత్తలు తీసుకొని తమకు సహకరించాలని ఏఈ సూచించారు.

### సమస్యలను సామరస్యంతో పరిష్కరించుకోండి

**మోమిన్‌పేట్, జూన్ 22. ప్రభాతవార్త:** మోమిన్‌పేట మండల పరిధిలోని రాళ్ళగుడుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో డ్వాక్రా మహిళ సాధికారిక భవన నిర్మాణానికి సంబంధించి తలెత్తిన సమస్యాత్మక స్థలాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామంలో ఇటువంటి సమస్యలు తలెత్తి నపుడు గ్రామస్తులందరు కలిసి కూర్చొని సామరస్యంతో చర్చించుకుని సమస్యలను పరిష్కరించు కోవాలని సూచించారు. చిన్నచిన్న సమస్యలు పెద్దవిగా చేసుకో వడం గ్రామాభివృద్ధికి, గ్రామ ప్రజల శాంతి సౌకర్యా లకు మంచిది కాదని అన్నారు. సమస్య ఏదైనా పరస్పర అవగాహనతో శాంతియుత చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్య క్రమంలో గ్రామ సర్పంచ్ మహిపాల్, మార్కెట్ కమిటి మాజీ వైస్ ఛైర్మన్ లక్ష్మయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వేమారెడ్డి, మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు ఆశిరెడ్డి, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు రమేష్, బిసి సంఘం జిల్లా అధ్యక్షులు యాదగిరి యాదవ్, గ్రామపెద్దలు, బిసి సంఘాల నాయకులు, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభానికి సన్నాహాలు

**కొడంగల్, జూన్ 22,(ప్రభాతవార్త):**

కొడంగల్ పట్టణంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం జీజీహెచ్ సూపరిండెంట్ మాలతితో పాటు వైద్య బృందం అంతా కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ త్వరలోనే ఆసుపత్రి ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. పనులు వేగంగా చేయాలని సంభందిత కాంట్రాక్టర్‌కు ఆదేశం చారు. మెడికల్ కళాశాలకు కావాల్సిన టీచింగ్ తరగతులకు కావాల్సిన పరికరాలు ,గదులు



కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న జీజీహెచ్ మాలతి

పరిశీలించి పలు సూచనలు ,అందించారు. ఈ కార్యక్రమంలో ఈఎన్‌టీ ప్రొఫెసర్ షీలాఅహ్మద్,వైద్యులు నాగరాజు, ఆర్ఎంఒ డాక్టర్ సునీల్,డాక్టర్ రవీంద్ర యాదవ్,డాక్టర్ సాకేత్,కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి,మున్సిపల్ ఛైర్మేన్ నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### దేవాలయ భూముల కబ్జాలపై విచారణ జరపాలి

**శంషాబాద్ జూన్22,ప్రభాతవార్త :**

శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్వాలగూడ గ్రామంలో దేవాలయ భూములు మరియు వారసత్వ భూములపై అక్రమ కబ్జాలు జరిగాయనే ఆరోపణలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. గ్రామంలోని శ్రీ కట్టమైసమ్మ దేవాలయానికి చెందిన సర్వే నంబర్128లో ఉన్న 1 ఎకరం 16 గుంటల భూమి అక్రమ ఆక్రమణలకు గురైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా సర్వే నంబర్లు 128/ఏ, 128/ఈ పరిధిలోని 1 ఎకరం 18 గుంటల భూమి తమ పూర్వీకులకు నవాబుల కాలంలో కేటాయించ బడిందని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆ భూములను కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ, సంబంధిత పత్రాలను పరిశీలించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ విషయం రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ బిజెపి ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకుని రావడంతో వెంటనే కొత్వాల్ గూడ గ్రామానికి చేరుకొని దేవాలయ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులంతా ఒక్కతాటిపై ఉండి భూమిని కాపాడుకోవడానికి అందరూ కలిసి రావడం చాలా సంతోషంగా ఉందని ఈ భూమిని గతంలో కట్ట మైసమ్మ దేవాలయానికి దానం చేసినట్లు వారు తెలిపారు. దేవాలయానికి చెందిన ఈ భూమిపై అక్రమ అక్రమణలు జరుగుతున్నాయని వెంటనే రెవెన్యూ మరియు దేవాదాయ శాఖ అధికారులు విచారణ చేపట్టి భూమిని పరిరక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం చేవెళ్ల చంద్రయ్య కుమారులు రమేష్, కృష్ణ, రాకేష్ మాట్లాడుతూ తమ కుటుంబానికి చెందిన భూములపై జరిగిన ఆక్రమణలపై రెవెన్యూ మరియు దేవాదాయ శాఖలు వెంటనే విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ లింగం యాదవ్, కొత్తకాపు రాజు రెడ్డి, మధు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



దేవాలయ ప్రాంగణంలో సమావేశమైన నాయకులు,గ్రామస్తులు

**PUBLIC NOTICE**

The general public are here by informed that my client **Samireddy Tulsi W/o Narsimha,** aged about 43 years R/o Ramanthapur, Hyderabad, has entered into an agreement to purchase the open Plot 266 sector "B" in Sy.nos. 15, part, 16 part, 47 part, 49,50,51,52 part, and 57 part Adm. 200 sq. yards and my client entering an agreement of sale, situated at Annojiguda, Ghatkesar Mandal, Medchal Malkajigiri dist., and bounded by **North: 30" wide road, South: plot No. 285, East: Plot No. 265, West: plot No. 267** open plot from Sri. Bandi Shravan Kumar S/o Bandi Kanakaiah, aged 40 years Occ,. Business, R/o 16-2-751/A/9, Road No. 2 Lane No. 9 Geetha Prashanthi Kirana store, Karan Baghi, New Saidabad colony, Hyderabad, and paid substantial amount of Rs. 8,00,000 as advance sale consideration. If any persons has got any claim or inherit over the said plot may contact the undersigned within 15 days from the date of publication of this notice, along with documentary evidence failing which my client would proceed further and complete the sale transaction by getting the sale deed registered thereafter no claims of whatsoever nature would bind my client.

**M/s P. Chandra Shekar**
**Advocate**
R/o. 11-99/SP/61NP/62/SP, P.S. Road, Ghatkesar (V&M), Medchal-Malkajigiri Dist. 501301.
**Ph. 9848371083**

## పుట్ట గొడుగుల సాగుపై అవగాహన

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 22, ప్రభాత వార్త:** పుట్ట గొడుగుల సాగుతో మంచి లాభాలు సాధించవచ్చని ఇందిరాగాంధీ కృషి విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ పి. ఠాగూర్ అన్నారు. అనురాగ్ విశ్వ విద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌లోని ప్లాంట్ పాథా లజీ విభాగం ఆధ్వర్యంలో పుట్టగొడుగుల సాగు ద్వారా వ్యవసాయ పారిశ్రామిక అభివృద్ధిపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు కార్యక్రమం నిర్వ హించారు. మూడు రోజుల పాటు సాగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రామ్‌కు ముఖ్య అతిథులుగా హాజరైన వక్తలు మాట్లాడుతూ పుట్టగొడుగుల సాగు పద్ధతులు, వ్యాపార అవకాశాలు, పోషక ఔషధ విలువలు, తెగుళ్ల గుర్తింపు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. పుట్టగొడుగు కోత అనంతరం తీస్కోవాల్సిన జాగ్రత్తలు, ప్రాసెసింగ్ విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటి అంశాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఓయిస్టర్ మిల్కీ పుట్టగొడుగుల సాగు విధానాలపై ప్రాక్టికల్ శిక్షణ అందించారు.

ఈ కార్యక్రమంలో డీన్ విజయ ఖాదర్, యువ పారిశ్రామిక వేత్త ప్రీతి, కళాశాల డీన్ పి. నారాయణ రెడ్డి, ప్రోగ్రామ్ కన్వీనర్ కె. అరవింద్, కో కన్వీనర్ జయంతి, స్వాతి, రవి, రవీందర్ రెడ్డి, దివాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణను ఆగం చేసిన రేవంత్ రెడ్డి

**మాజీ మంత్రులు హరీష్ రావు, శ్రీనివాస్ గౌడ్**

**కడ్తాల్, జూన్ 22, ప్రభాత వార్త:** తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే అధికారంలోకి రావాలని రైతులు మాజీ మంత్రి హరీష్ రావుతో అన్నారు. సోమవారం అచ్చంపేటలో జరిగే కార్య కర్తల సమావేశానికి హైదరాబాద్ నుండి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డితో కలిసి హరీష్ రావు వెళ్తుండగా మార్గమధ్యలో కడ్తాల పట్టణంలో ఉన్న ఆగ్రో ఎరువుల దుకాణం వద్ద రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ రైతుబంధు వస్తుందా అని రైతులను అడిగి తెలుసుకోగా రైతుబంధు ఎకరా నుంచి రెండు ఎకరాల వరకే వేయడం జరిగిందని యూరియాకు అష్టకష్టాలు పడు తున్నామని రైతులు తెలిపారు. యాప్ ద్వారా యూరియా నమోదు వల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు హరీష్ రావుతో అన్నారు. పాల బిల్లులు రాక తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాడి రైతులు హరీష్ రావుకు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు బిడ్డనంటూ రైతులను తెలంగాణ రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నారని ఆయన అన్నారు. రైతు బంధును బందు చేశారు. రైతు బీమా భోగసయ్యింది. కెసిఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతు బీమా, కరెంటు వంటి పథకాలు సక్రమంగా రాష్ట్రంలో అమలు చేయడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలం చెందారని ఆయన ఆరోపించారు. హరీష్ రావు వెంట డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు జోగు వీరయ్య, సర్పంచ్ గోపాల్, గంప శ్రీనివాసులు, రామకృష్ణ, జగదీశ్వర్, శ్రీకాంత్, అమృతం పాండు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.



**వెల్‌చాల్ ప్రాథమిక పాఠశాలలో**

## సామూహిక అక్షరాభ్యాసం

**మోమిన్‌పేట్, జూన్ 22. ప్రభాతవార్త:** విద్యార్థులు చిన్నప్పటి నుండే క్రమశిక్షణతో కూడిన విద్యను అలవాటు చేసుకోవాలని స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెల చాల్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ అధికారి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశం తో కలిసి పాఠశాలలో ముందు గా సరస్వతి దేవి చిత్ర పటానికి జ్యోతి వెలి గించి ప్రత్యేక పూజ చేసిన అనంతరం విద్యార్థులకు సామూ హిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భం గా యువ నాయకుడు గ్రామ సర్పంచ్ శ్రీని వాస్ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపా ధ్యాయులతో ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన చేయడం ద్వారా విద్యార్థుల భవి ష్యత్తుకు గట్టిపునాది అని పేర్కొన్నారు. నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కొరకు ఉచితంగా ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, క్రీడా సామాగ్రి, డిజిటల్ బోధనతో విద్యాభివృద్ధి కొరకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన చదువు ఉచితంగా అందించడం జరుగుమన్నదని వారు తెలిపారు. కనుక విద్యార్థుల తల్లితండ్రు లు ప్రైవేటు పాఠశాలలకు మొగ్గు చూపకుండా, అనవసరంగా డబ్బులు వృధా చేసుకోకుండా అన్నీ ఉచితంగా



ప్రాథమిక పాఠశాల విధ్యార్థులచే సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్,తదితరులు.

అందిస్తూ, నాణ్యమైన చదువుతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తున్న మన ప్రభుత్వ పాటశాలలో చదివించాలని కోరారు. మరియు నేడు ప్రభుత్వ పాఠశాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం ఎంతవరకైనా ఉచితంగా చదివించి, వారి ప్రతిభను బట్టి విదేశాలలో కూడా ఉచితంగా చదివించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎంత డబ్బైనా ఖర్చు పెడుతున్నదని అన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ ప్రతిభ కల్గిన విద్యార్థులకు తమవంతు సహాయం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణాదేవి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘం నాయకురాలు షహనాజ్‌సుల్తానా, యువకులు విధ్యార్థులు తదితరులు పాల్గొని అక్షరభ్యాస కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆటో ఢీకొని విద్యార్థి మృతి

**గోవిందు పోచయ్య కాలనీలో అలుముకున్న విషాదం**

**నందిగామ, జూన్ 22, ప్రభాతవార్త :** ఆటో ఢీకొని విద్యార్థి మృతి చెందిన సంఘటన నందిగామ మండల పరిధిలోని చేగూరు గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన అబ్బు బాకర్ (5) నర్సప్పగూడ గ్రామపంచాయతీ పరిధిలోని పోచయ్య కాలనీలో గత 15 సంవత్సరాల నుండి నివసిస్తున్నారు.

చేగూరు గ్రామంలోని శ్రీ శాంతినికేతన్ స్కూల్లో అబ్బు బాకర్ 1 వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం స్కూలు ముగిసిన తర్వాత ఇంటికి వస్తున్న సమయంలో స్కూల్ బస్సు దిగి రోడ్డు దాటుతుండగా ఆటో డీ కొట్టడంతో తీవ్ర రక్త గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు బాలుడిని చికిత్స నిమిత్తం షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. బాలుడి తండ్రి తండ్రి సద్దాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్ తెలిపారు.

# లారీ డ్రైవర్‌కి బురిడీ : ఇద్దరు మహిళల అరెస్ట్

**- నగదు స్వాధీనం**

**శంషాబాద్ జూన్ 22,ప్రభాతవార్త :**

ఓ లారి డ్రైవర్‌ను సహాయం కోరి నగదు ఎత్తుకెళ్లిన ఘటనలో ఇద్దరు మహిళలను శంషాబాద్ రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.సిఐ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం...

ఈనెల 17వ తేదిన డ్రైవర్ షేక్ బాబా వలి ఎపి 39 డబ్ల్యుఎం 3786 గల లారీలో చిత్తూరు జిల్లా పుంగనూర్ నుండి టమాటాలు లోడ్ చేసుకొని హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లికి వచ్చి సరుకును అన్‌లోడ్ చేశాడు. అనంతరం 18వ తేదిన తిరుగు ప్రయాణంలో తుక్కుగూడ గ్రామ పరిధికి చేరుకోగా సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో రోడ్డుపై ఒక మహిళ పడిపోయి ఇబ్బంది పడుతున్నట్లు కనిపించింది. ఆమెతో పాటు ఉన్న మరో మహిళ లారీ ఆపమని కోరడంతో మానవతా దృక్పథంతో ఇద్దరినీ లారీలో ఎక్కించు కున్నాడు.పెద్ద గోల్కొండ టోల్ గేట్ వద్దకు




పోలీసులు అదుపులో మహిళలు

చేరుకున్న తరువాత ఆ ఇద్దరు మహిళలు లారీ నుండి దిగిపోయారు. అనంతరం లారీలో బెడ్ షీట్‌లో ఉంచిన రూ.38,000 నగదు కనిపించకపోవడంతో డ్రైవర్ షేక్ బాబా మహిళలను ప్రశ్నించగా, వారు దుర్భాషలాడుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.వెంటనే బాధితుడు శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.సోమవారం పెద్ద గోల్కొండ పరిసర ప్రాంతాల్లో విచారణ చేపడుతుండగా సంఘిగూడ వద్ద ఇద్దరు మహిళలు అనుమానా స్పదంగా కనిపించారు. వారిని విచారించగా వారు బుజ్జి పాత్లావత్ (50) మన్నీ పాత్లావత్ (48) కుర్యగడ్డ తండా గ్రామం, మోతీఘన్‌పూర్ బాలానగర్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా నివాసులుగా చెప్పారు.విచారణలో వారు పెద్ద గోల్కొండ టోల్ గేట్ సమీపంలో లారీలో నుంచి రూ.38,000 నగదు దొంగిలించినట్లు ఒప్పు కున్నారు. దీంతో పోలీసులు ఇద్దరు మహిళలను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి దొంగిలించిన రూ.38,000 నగదును స్వాధీనం చేసుకు న్నారు.ఈ కేసును ఛేదించి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన హెడ్ కానిస్టేబుల్ విజయ్ కుమార్ మరియు కానిస్టేబుల్ రాజులను శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

# తక్కువ ధరకే వాహనం అంటూ యువకుడికి సైబర్ మోసం

**శంషాబాద్ జూన్ 22,ప్రభాతవార్త :**

ఇన్‌స్టాగ్రామ్‌లో తక్కువ ధరకే వాహనం వస్తుందని నమ్మి ఓ యువకుడు సైబర్ మోసానికి గురైన ఘటన శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచుసుకుంది.సిఐ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం...మండలంలోని మదనపల్లి కొత్త తాండకు చెందిన పాత్లవత్ మహేష్ (26) ఈనెల 18వ తేదిన ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చూస్తుండగా తక్కువ ధరకే వాహనం విక్రయిస్తున్నట్లు వచ్చిన ప్రకటనను గమనించి వెంటనే ఆసక్తితో స్పందించి వాహనం ధర గురించి సందేశం పంపగా, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా సంప్రదించి వాహనం తుది ధర రూ.85,000 ఇస్తామని నమ్మించారు.అనంతరం ఆధార్ కార్డు వివరాలు, లొకేషన్ పంపించాలని చెప్పి వాహనం పత్రాలు సిద్ధం చేసి పంపిస్తామని నమ్మించారు.వారు పంపిన స్కానర్‌కు మొదట రూ.1,000, తర్వాత రూ.2,000 చెల్లింపులు చేయించారు. అనంతరం తాము ఇండియన్ ఆర్మీకి చెందినవారమని చెప్పి వాహనం ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు, జిపిఎల్ ట్రాకింగ్ కోసం రూ.7,999 చెల్లించాలని కోరగా, ఫిర్యాదుదారుడు ఆ మొత్తం కూడా పంపించాడు.మరుసటి రోజు వాహనం పంపించేందుకు రూ.15,500 చెల్లించాలని చెప్పగా, ఆ మొత్తాన్ని కూడా పంపించాడు. అనంతరం మరోసారి రూ.21,500 చెల్లించాలని కోరడంతో ఫిర్యాదుదారుడు మరో స్కానర్‌కు ఆ మొత్తాన్ని బదిలీ చేశాడు. ఈ విధంగా మొత్తం రూ.49,999 చెల్లించిన తరువాత అనుమానం రావడంతో సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు.అనంతరం శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# పేద ప్రజల సౌకర్యం కోసమే బ్యాంకు ఏర్పాటు

**నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే కశిరెడ్డి**

**తలకొండపల్లి జూన్ 22, ప్రభాతవార్త:**

రాష్ట్రంలోని పేద ప్రజల బాగు కోసమే బ్యాంకు ఏర్పాటు చేసినట్లు నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం కన్వీనర్ డాక్టర్ మల్లు రవి అన్నారు. సోమవారం నాడు రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని గట్టిప్పలపల్లి గ్రామంలో నూతనంగా యూనియన్ బ్యాంకు ను ప్రారంభించారు . ఈ కార్యక్రమానికి నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, బిజెపి రాష్ట్ర నాయకులు ఆచారి, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డిలు ముఖ్యఅతిథిగా హాజరైన నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మలురై మాట్లాడుతూ పేద ప్రజల మేలుకోసమే రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తుందని, గత కొన్ని సంవత్సరాలుగా గట్టిప్పలపల్లి గ్రామ ప్రజల కోరిక మేరకు బ్యాంకు ను ఏర్పాటు చేసేందుకు ఢిల్లీ స్థాయిలో అధికారులను ఒప్పించి బ్యాంకు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ బ్యాంకు ద్వారా అన్ని వర్గాల ప్రజలు వ్యాపారస్తులు అందరికీ అనుకూలంగా ఉంటుందని ఈ బ్యాంకు ద్వారా పేద ప్రజల కు అందవలసిన ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కు అందవలసిన ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పొలాలు పథకాలను పేద ప్రజలకు అందే విధంగా చూడాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అంతకుముందు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ గ్రామ ప్రజల కోరిక మేరకు బ్యాంకు ఏర్పాటుకు కృషి చేసినట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, బిజెపి రాష్ట్ర నాయకులు తల్లుజు ఆచారి, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడమ సత్యం, సింగల్ బిండ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ యాదగిరి నరసింహ, కాంగ్రెస్ నాయకులు డేవిడ్ రేన్ రెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ జోలం జయమ్మ వెంకటయ్య, మాజీ సర్పంచ్ జోలం జయమ్మ వెంకటయ్య, మైసయ్య, చంద్రశేఖర్ రెడ్డి తో పాటు ఆయా పార్టీల నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వీర్లపల్లి హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలన

**నందిగామ, జూన్ 22, ప్రభాతవార్త :** మాటల్లో కాదు.. చేతల్లో నిరూపిస్తున్నారు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. నందిగామ నుండి వీర్లపల్లి మీదుగా అటు చేగూరు ఇటు మామిడిపల్లి వెళ్లే దారిలో సుమారు రూ.3 కోట్లతో నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను సోమవారం నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ , ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఏఎంసి డైరెక్టర్ సి నర్సింలు,పాలకవర్గం సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా వాగు పొంగి ప్రవహించడంతో సుమారు 10 గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయేవని, విద్యార్థులు, రైతులు, కార్మికులు ,కర్షకులు ఇబ్బందులు పడేవారని, గీత కార్మికుల జీవనోపాధికి అంతరాయం ఏర్పడేదని విచారం వెలిబుచ్చారు. ప్రజల, వాహనదారుల కష్టాలను స్వయంగా చూసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రెండు గ్రామాల మధ్యలెవెల్ బ్రిడ్జి నిర్మాణం



హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన సర్పంచ్.

చేపట్టి ప్రజల కష్టాలకు చెక్ పెట్టడం పట్ల చుట్టూరా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ.. ఎమ్మెల్యే కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పనులు పరిశీలనలో వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, శివగల్ల ప్రవీణ్, బొమ్మగళ్ళ నర్సింలు,టైలర్ కృష్ణ, నాయకులు బుయ్యని కృష్ణ యాదవ్ తదితరులున్నారు.

## తాగునీటి కష్టాలకు చెక్

**జైరాం తండాలో బోర్ మోటర్ ఏర్పాటు**

**పెద్దెముల్, జూన్ 22, ప్రభాత వార్త:** పెద్దెముల్ మండల పరిధిలోని జైరాం తండా (I) గ్రామ పంచాయతీ, దారునివాగు తండాలో ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. సోమవారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో, ఎల్ఎన్ఆర్ యువసేన అధ్యక్షులు లోంకా నర్సింలు ఆధ్వర్యంలో గ్రామంలో నూతనంగా తాగునీటి బోర్ మోటర్‌ను బిగించి, నీటి సరఫరాను అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా



స్థానిక సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ, తమ గ్రామంలోని ప్రజలు తాగునీటి కోసం ఎన్నో రోజులుగా పడుతున్న ఇబ్బందులను గమనించి, ఎమ్మెల్యేను కోరగానే ఆయన సానుకూలంగా స్పందించి, తక్షణమే సమస్యను పరిష్కరించారని తెలిపారు. ఎమ్మెల్యే చొరవ వల్ల గ్రామస్తులకు నీటి కష్టాలు తీరాయని, ఆయనకు గ్రామ ప్రజలందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని, ఈ సాయానికి తాము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని సర్పంచ్ భావోద్వేగంతో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎల్ఎన్ఆర్ యువసేన అధ్యక్షులు లోంకా నర్సింలు, సర్పంచ్ సురేష్, ఉపసర్పంచ్ సంతోష్ కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పరశురామ్, వార్డు మెంబర్లు రవి, అజీజ్, శంకర్, నాయకులు నాను నాయక్, హిర్య నాయక్, శ్రీనివాస్, శ్రీకాంత్, తిపన్న తదితర గ్రామ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

## యాప్ విధానం రద్దు చేసి రైతులకు పాత పద్ధతిలోనే ఎరువులు అందించాలి



వినతి పత్రం అందజేస్తున్న రైతులు

**చేవెళ్ల ఆర్డీవో కార్యాలయం అధికారులకు వినతి త్రతం అందించిన రైతులు**

**చేవెళ్ల, జూన్ 22, ప్రభాతవార్త :** ప్రభుత్వం ఎరువుల కోసం ప్రవేశపెట్టిన యాప్ వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారని చేవెళ్ల మండలంలోని ఆయా గ్రామాల రైతులు తెలిపారు. సోమవారం ఆయా గ్రామాల రైతులు చేవెళ్ల ఆర్డీవో కార్యాలయం వద్దకు వచ్చి ఆర్డీవో కార్యాలయంలో ఏవో ప్రభుదాసన్ను కలిసి వినతి ప్రతం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన యాప్ వలన రైతులు ఎరువులు దొరకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతులు వర్షాల కాలంలో విత్తనాలు వేసుకునే సమయ 0లో రైతులకు సకాలంలో డిఏపీ, యురియా అందకపోవడంతో రైతులు పర్టిలేజర్ దుకాణాల చుట్టు తిగిరిన దొరకని పరిస్థితి నెలకొందన్నారు. వ్యవసాయ అధికారులను అడిగితే యాప్ బుక్ చేసుకోవాలని చూసిస్తున్నారని వా పోయారు. ఫర్మర్ పర్ పర్టిలేజర్ యాప్ వలన రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. తెలిసిన వ్యక్తులే వారికి కావాల్సిన ఎరువులను దండుకోవడంతో పేద రైతులకు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యాప్ విధానం రద్దు చేసి రైతులకు పాత పద్ధతిలోనే ఎరువులు అందించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు తదితరులు ఉన్నారు.

## నేడు రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్: శ్యామ్

**ఘట్‌కేసర్, జూన్ 22, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలపై సర్కారు అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్ నిర్వహించనున్నట్లు ఎబివిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్యామ్‌కిరణ్ తెలిపారు. ఘట్‌కేసర్‌లో ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో ప్రభుత్వ పాఠశాల విద్య నిర్వీర్యం అవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉండి ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని రేషనలైజేషన్ పేరుతో 23,000ల ప్రభుత్వ పాఠశాలను ఎత్తివేసే కుట్ర చేస్తూ ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడికి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఎబివిపి ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కరవు అయ్యాయని విద్యార్థులకు ఇంకా స్కూల్ యూనిఫామ్స్ అందలేదని, విద్యాహక్కు చట్టం అటకెక్కిందని ఆయన విమర్శించారు. బంద్‌కు పాఠశాలల యాజామాన్యాలు, టీచర్లు, విద్యార్థులు సహకరించి జయప్రదం చేయాలని శ్యామ్‌కిరణ్ కోరారు.

## నేటి నుండి కొందుర్గులో విత్తనమేళా

**జిల్లేడు చౌదరి గూడ,కొందుర్గు జూన్ 22 ప్రభాతవార్త :** విత్తన సాగులో రైతు సోదరులను చైతన్యపరిచేందుకుగాను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లేడు చౌదరి గూడ, కొందుర్గు రైతు వేదికలో ఈనెల 23వ తేదీ నుండి 30 వరకు విత్తనమేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజేందర్ రెడ్డి తెలిపారు.

సోమవారం నాడు ఆయన రైతు వేదికలో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో రైతులకు నాణ్యమైన, వ్యవసాయ శాఖ ధ్రువీకరించిన విత్తనాలు, పంటల సాగు పై రైతులకు అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. వ్యవసాయానికి సంబంధించిన ఏవేని సమస్యలున్న ఈ నెలలో వివరిస్తే తప్పకుండా సూచనలు సలహాలు ఇస్తామని ఆయన తెలిపారు.

ఈ ప్రారంభ కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ పరపతి సంఘం కార్యవర్గ సభ్యులు, రైతు సంఘాల సభ్యులు, అనుభవజ్ఞులైన వ్యవసాయదారులు రైతులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

**సర్పంచ్ నరసింహులు యాదవ్**



మహిళ సమాఖ్య భవనం కోసం భూమిపూజ చేస్తున్న సర్పంచ్

**కుల్కచర్ల,జూన్ 22,ప్రభాతవార్త:** మహిళల ఆర్థిక అభివృద్ధి, సాధికారతే రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని సర్పంచ్ నరసింహులు యాదవ్ అన్నారు. మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో మహిళ సమాఖ్య భవనం కోసం స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరసింహులు యాదవ్ మాట్లాడుతూ..మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని బలోపేతం చేయబంలో కీలక పాత్రపోషిస్తున్నారని కొనియాడారు.ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని,ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.పార్టీలకు అతీతంగా ప్రజా సేవ చేయడమేతమ లక్ష్యమని,ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని సర్పంచ్ నరసింహులు యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ లక్ష్మయ్య గౌడ్, వార్డు సభ్యులు ఎల్లయ్య, గ్రామ నాయకులు కమ్మరి ఆంజనేయులు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు పాఠశాలల బంద్‌కు ఎబివిపి పిలుపు

**కుల్కచర్ల,జూన్ 22, ప్రభాతవార్త:** మండలంలో ప్రైవేటు, పాఠశాలలు ఆర్థిక దోపిడికి పాల్పడుతున్నాయని వాటికి రాష్ట్ర ప్రభుత్వం కొమ్ము కాస్తోందని ఎబివిపి మండల కన్వీనర్ హన్మంతు, మహిళ కన్వీనర్ సింధు అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని మండల విద్యాఅధికారి అబిబ్ హ్మాద్‌కు వినతిపత్రం అంద జేశారు.ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ. .తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్య నిర్వీర్యం అవుతుందని, సిఎం రేవంత్ రెడ్డిస్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉండి ప్రైవేట్ పాఠశాల లకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నాడన్ని, ప్రభుత్వ పాఠశాలల ఎత్తి వేతకు కుట్ర చేస్తూ... ప్రైవేట్, పాఠశాలల ఆర్థిక దోపిడికి కొమ్ముకాస్తున్న విరుచుకుపడ్డారు.23న పాఠశాలలు బంద్ చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్య క్రమంలో సంయుక్త కార్యదర్శి గౌతమ్, మారుతి ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్,భారత్ కళామంచ్ కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యా అధికారి అబిబ్‌హ్మాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎబివిపి నాయకులు

## విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలి

**సర్పంచ్ ఆంజిలయ్య**



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

**కుల్కచర్ల,జూన్ 22, ప్రభాతవార్త:** విద్యార్థుల చదువులపట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి సర్పంచ్ వార్వల ఆంజిలయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కెజిబివీ ప్రత్యేక అధికారి దేవి కిషన్ ఆధ్వర్యం లోవిద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ వార్వల ఆంజిలయ్య మాట్లాడుతూ...విద్యార్థుల పట్లశ్రద్ధ వహించాలన్నారు. వి ద్యార్థులకు నాణ్యమైన భోజ నంతో పాటు, మంచివిద్య అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు వెంటనే కేటాయించాలి

**షాద్‌నగర్, జూన్ 22, ప్రభాతవార్త :** జిల్లాలో నెలకొన్న పలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పూర్తి పారదర్శకతతో అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలని కోరారు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల కోసం కేటాయించిన హెచ్ఎండీఏ ప్లాట్లను లబ్ధిదారులకు తక్షణమే రిజిస్ట్రేషన్ చేసి అందజేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. షాద్‌నగర్ పట్టణ పరిధిలోని బొబ్బిలి చెరువులో గత నెల రోజులుగా అక్రమంగా మట్టి రవాణా జరుగుతోందని ఆరోపించిన ఆయన, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా ఆస్తులను పరిరక్షి ంచడంతో పాటు ప్రభుత్వ భూముల అక్రమ వినియోగాన్ని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.జిల్లాలోని ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, పేదలకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాల అమలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ క్యామ మల్లేశ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్లో ఫిర్యాదు చేస్తున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



విద్యార్థులకు పుస్తకాలు,నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న సర్పంచ్,తదితరులు

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- సర్పంచి బిసా కవిత కరుణాకర్ రెడ్డి

**కేశంపేట, జూన్ 22, ప్రభాతవార్త :**కేశంపేట మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించి పాఠ్యపుస్తకాలు నోట్ బుక్కులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో కొత్తగా చేరిన నలుగురు విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించి కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు ఆడపిల్లకు 2000 మగ పిల్లలకు 1500 చొప్పున నగదు పారితోషకం అందజేశారు. ఈ సందర్భంగా కవిత కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి నగదు పారితోషకం ఇవ్వడం తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులందరూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్, దేవేందర్ రెడ్డి ,పవన్ కుమారి ,వార్డు సభ్యులు కందిన సంతోషా శివయ్య,నాగిళ్ల ప్రేమలత యాదయ్య ,గ్రామస్తులు చిట్టి రెడ్డి వెంకట్ రెడ్డి, గుత్తి శేఖర్, భీమ్ రెడ్డి సుధాకర్ రెడ్డి, మట్ట వెంకటయ్య ,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణంపై వ్యాస రచన పోటీలు




వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో అధ్యాపకులు

**కేశంపేట, జూన్ 22, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని చింతకుంటపల్లి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మై భారత్ రంగారెడ్డి జిల్లా సహకారంతో ప్రపంచ పర్యావరణ పై సోమవారం కొత్తపేట జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి,విజేతలకు బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు మరియు గ్రామ సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్, మై భరత్ ప్రతినిధి శ్రీశైలం యాదవ్ ,ఇన్చార్జి ప్రిన్సిపల్ శ్రీకాంత్, అధ్యాపకులు నాగయ్య, నారాయణ, లక్ష్మీ మ్రరాజ్, ధ్రువ కుమార్ ,సదానంద గౌడ్, రాణి ,శిరీష ,శ్రీనివాస్, తిరుపతయ్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో యువకుడు మృతి

**కందుకూరు, జూన్ 22, (ప్రభాతవార్త):**విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్న యువకుడు ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతాన్ని గురై మృతి చెందిన సంఘటన కందుకూరు మండలం చిప్పలపల్లి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం అజిలాపురం గ్రామానికి చెందిన నేనావత్ లచ్చిరాం నాయక్ కుమారుడు నేనావత్ గణేష్ నాయక్ (17) చదువు మధ్యలో ఆపేసి ఏడాదికాలంగా తమ సమీప గ్రామానికి చెందిన మర్రిగూడ మండలం ఎరుగండ్లపల్లి గ్రామానికి చెందిన నాగార్జున రెడ్డి వద్ద ఎలక్ట్రికల్ లేబర్గా పనిచేస్తున్నాడు 21వ తేదీన విధులకు వెళ్లిన గణేష్ నాయక్ చిప్పలపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 93, 94లోని వ్యవసాయ భూమిలో విద్యుత్ తీగలు బిగించే పనిలో పాల్గొన్నారు. సాయంత్రం 4:45 గంటలకు విద్యుత్ స్థంభానికి తీగలు బిగిస్తుండగా విద్యుత్ స్థంభం వంగిపోవడంతో విద్యుత్ ప్రవాహం ఉన్న పక్క లైను టచ్ అయింది స్తంభంపై ఉన్న గణేష్ విద్యుత్ గాథానికి గురై కింద పడిపోగా అతన్ని వెంటనే సమీపంలోని మహేశ్వరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విధి నిర్వహణలో ఉన్న వైద్యులు పరీక్షి ంచగా గణేష్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని విషయాలు తెలుసుకుని కందుకూరు పోలీసులకు తండ్రి నేనావత్ లచ్చిరాం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆరోపణ ప్రకారం సంబంధిత కాంట్రాక్టర్ సరైన వాళ్ళచర్యలు తీసుకోని కారణంగా ఈ ఘటన జరిగిందని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## విద్యార్థులు యోగపై శ్రద్ధ చూపాలి



యోగ చేస్తున్న డైరెక్టర్ వీరశం,ఉపాధ్యాయులు,విద్యార్థులు

**పరిగి టౌన్ ,జూన్ 22, ప్రభాతవార్త :**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఇండస్ వ్యాలీ పాఠశాలలో విద్యార్థులకు యోగ ట్రైనర్ పరమేశ్వరి అభ్యాసం చేయించారు. వారికి ఆరోగ్యానికి సంబంధించిన యోగ ద్వారా ఉపయోగాలు యోగ సాధన అనేది అనునిత్యం జరిగితే చాలా రకాలైనటువంటి ప్రయోజనాలు ఉంటాయని ఆరోగ్యంగా శారీరకంగా మానసికంగా ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వీరేశం మాట్లాడుతూ... పిల్లలంతా ఆరోగ్యంగా ఉండాలంటే పండ్లు కూరగాయలు తాజా ఆహార పదార్థాలను గుణించినట్లయితే భవిష్యత్తులో ఆరోగ్యంతో పాటు అనుకున్నటువంటి లక్ష్యాలను సాధించడానికి అవకాశం ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవేందర్ నరసింహారెడ్డి ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎకరాకు రూ.60 లక్షల పరిహారం ఇవ్వాలి



కలెక్టర్‌తో సర్పంచ్ వార్డు సభ్యులు రైతులు

**యాచారం, జూన్ 22, ప్రభాతవార్త:**

మార్కెట్ విలువల ప్రకారమే నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్థులతో కలిసి మొండి గౌరెల్లి సర్పంచ్ కొలను రమాదేవి మల్లారెడ్డి కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం పెంచిన భూముల మార్కెట్ విలువల ప్రకారం యాచారం మండలం మొండిగౌరెల్లి గ్రామంలో ఎకరాకు రూ.60 లక్షల నష్టపరిహారం చెల్లించాలని గ్రామ సర్పంచ్ కోలన్ రమాదేవి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె తన పాలకవర్గం, గ్రామస్థులు రైతులతో కలిసి రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి రెవెన్యూ డివిజనల్ అధికారిలను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించాలి అన్నారు. పెరిగిన భూముల విలువల ప్రకారం ఎకరాకు రూ.60 లక్షలు ఇస్తేనే భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.అధికారులు సానుకూలంగా స్పందించి రైతులకు తగిన న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమానికి పెద్దపీట

-ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**శంషాబాద్ జూన్ 22,ప్రభాతవార్త :**

సీఎం రేవంత్ రెడ్డి మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం శంషాబాద్ జిహెచ్ఎంసి కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అతిథిగా హాజరై డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు తో కలిసి స్థానిక మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళా సాధికారతకు దోహదపడే సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం నిరంతరం కొనసాగిస్తోందని పేర్కొన్నారు. మహిళలకు 32 వేల ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలు, స్థానిక నాయకులు, అధికారులు,



మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



రామేశ్వరంలో పూజలు చేస్తున్న పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

# ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా రామేశ్వర క్షేత్రం

**షాద్‌నగర్, జూన్ 22, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామేశ్వరాలయంలో బీజేపీ సీనియర్ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సోమవారం శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, రామేశ్వర క్షేత్రం ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి పుణ్యక్షేత్రాల్లో నిర్వహించే పూజలు సమాజంలో సానుకూల వాతావరణాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.అనంతరం బీజేపీ నాయకుడు దినేష్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయ, సామాజిక సేవా కార్యక్రమాల్లో దినేష్ రెడ్డి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షి స్తూ శుభాభినందనలు అందజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఇస్నతి శ్రీనివాస్, సుధాకర్ అప్పా, మెద్దె గణేష్, అనిల్ కుమార్ గౌడ్, హనుమత్, రాజు నాయక్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నాయకులు ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రజల సంక్షేమం కోసం ప్రార్థించారు.

# విద్యాశాఖ కార్యాలయం ముట్టడి

**షాద్‌నగర్, జూన్ 22, ప్రభాతవార్త :** తెలంగాణలో ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే చర్యలను వ్యతిరేకిస్తూ, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) షాద్ నగర్ విద్యార్థి నాయకుడు ఆకాష్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం లక్ష్మీకాపూల్‌లోని పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ఎదుట భారీ ధర్నా, ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను తగ్గించే నిర్ణయాలు తీసుకోవడం విద్యార్థి వ్యతిరేక చర్య అని విమర్శించారు. 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకే పరిమితం చేసే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ విద్యారంగాన్ని అన్ని విధాలుగా పరిరక్షి ంచి, సర్కారు బడులను మరింత బలోపేతం చేయాలని కోరారు. అలాగే



ఆకాష్ నాయక్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కఠినమైన రుసుముల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించి, వారికి ఉచిత విద్య అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు.ధర్నా సందర్భంగా నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆకాష్ నాయక్‌తో పాటు పలువురు నాయకులను అరెస్టు చేసి నాంపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు సంఘం నాయకులు తెలిపారు.

అరెస్టులు, పోలీసుల చర్యలకు భయపడబోమని, పేద విద్యార్థులకు న్యాయం జరిగే వరకు, ప్రభుత్వ విద్యను పరిరక్షి ంచే వరకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఏఐఎస్ఎఫ్ నాయకులు స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న తాండూర్ ఆర్డీవో అనిత

## కొడీడ్ గ్రామంలో భూసేకరణపై కీలక గ్రామసభ నిర్వహణ

**దౌల్తాబాద్,జూన్ 22,ప్రభాతవార్త:**

నారాయణపేట,కొడంగల్,మక్తల్ నియోజకవర్గాల చిరకాల వాంఛ అయిన నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.ఈ ప్రాజెక్టులో భాగంగా దౌల్తాబాద్ మండలం కౌడీడ్ గ్రామంలో భూసేకరణ ప్రక్రియ కోసం సోమవారంరోజు అధికారులు ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు.ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ఈ ఎత్తిపోతల పథకం కోసం కౌడీడ్ గ్రామం పరిధిలో 9.15 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది.ఈ ప్రక్రియలో భాగంగా,ప్రాజెక్టు ప్రాధాన్యతను ,భూసేకరణకు సంబంధించిన విధివిధానాలను వివరించేందుకు అధికారులు గ్రామస్థులతో ముఖాముఖి నిర్వహించారు.ఈ సమావేశానికి తాండూర్ ఆర్డీవో అనిత హాజరై,ప్రాజెక్టు వల్ల ఆ ప్రాంత రైతులకు సమకూరనున్న ప్రయోజనాల గురించి వివరించారు.రైతుల భాగస్వామ్యం వెనుకబడిన ప్రాంతాల్లో సాగునీటి సౌకర్యాలను మెరుగుపరచాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా,స్థానిక రైతులు ఈ గ్రామసభకు హాజరయ్యారు.ఈ సంధర్భంగా తాండూర్ ఆర్డీవో అనిత మాట్లాడుతూ...ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే ఈ ప్రాంత సాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరుతాయని పేర్కొన్నారు.భూసేకరణ ప్రక్రియ పారదర్శకంగా ఉంటుందని,రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాల గురించి ఆమె వివరించారు.ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించే అంశంపై రైతులు తమ అభిప్రాయాలను అధికారులతో పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ తహసీల్దార్ వెంకట్ స్వామి,డిప్యూటీ తహసీల్దార్ వెంకటచారి,కౌడీడ్ గ్రామ సర్పంచ్ రాంచందర్,అదికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చటాన్ పల్లి గెట్ రహదారిపై గుంతలు పూడ్చండి

**షాద్‌నగర్, జూన్ 22, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ సంతోషి బాయి చందులాల్ ఆదివారం రోడ్లు మరియు భవనాల శాఖ (ఆర్ బీ) ఏఈఈ రాజశేఖర్‌కు వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రంలో భాగంగా, షాద్‌నగర్ పట్టణంలోని మక్త మాదారం షాద్ నగర్ చటాన్ పల్లి గెట్



వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్

రహదారిపై ఉన్న రోడ్డు లోతుగా గుంతలు, వర్షపు నీరు నిలిచి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా గుంతలు ఉండడం వల్ల ప్రమాదాలకు అవకాశం పెరుగుతోందని తెలిపారు. అదేవిధంగా, రహదారిపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చి మరమ్మతులు చేపట్టి, ప్రజలకు సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యను అత్యవసరంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని ఏఈఈ రాజశేఖర్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కౌన్సిలర్ సంతోషి బాయి చందులాల్ తెలిపారు.

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

**చేవెళ్ల, జూన్ 22, ప్రభాతవార్త :** ప్రజ సమస్యల



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డి

పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రజావాణీ కార్యక్రమం నిర్వహిస్తుందని చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డి తెలిపారు. సోమవారం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణీ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆర్డీవో స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు తమ సమస్యలు నేరుగా తెలుపుకునేందుకు ప్రజావాణీ కార్యక్రమంలో చాలా వరకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మొత్తం 7 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రభుదాస్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



## మిషన్ భగీరథ నీటిని సద్వినియోగం చేసుకోండి!

సర్పంచ్.....ప్రభాకర్

**కొందుర్గు, జూన్ 22, ప్రభాతవార్త:** మిషన్ భగీరథ నీరు ఎంతో స్వచ్ఛమైందని, ఆ నీరు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరము అని స్థానిక సర్పంచ్ చాడ పురం ప్రభాకర్ అన్నారు.సోమవారం నాడు ఆయన కొందుర్గులో హర్ జెల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో ఇంటింటికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే లక్ష్యంగా వారు చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు. నీటి ప్రాముఖ్యత గురించి ఆయన ఆవాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ రు కేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి రమేష్, వార్డు సభ్యులు కొమరబండ సునీత, పోమల అనుష, యారం శ్వేత, శీలం లింగం, తంగళ్ళపల్లి నవీన్, బొజ్జిగారి శ్రీను, బి బి ఎస్ హెడ్ మాస్టర్ రాధాకృష్ణ తో పాటు గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## అమ్మ పేరుతో మొక్క నాటుదాం

బిజేపి జిల్లా అధ్యక్షులు కరణం ప్రహ్లాద్ రావు

**కుల్కచర్ల,జూన్ 22,ప్రభాతవార్త:** నరేంద్ర మోడి పిలుపు మేరకు అమ్మ పేరుతో మొక్క నాటు కార్యక్రమం విజయవంతం చేయాలని బిజేపి జిల్లా అధ్యక్షులు కరణం ప్రహ్లాద్ రావు అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటినీరు పోశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మ పేరుతో మొక్క నాట డం ద్వారా గుర్తింపుగా పర్యావరణ పరిరక్షణకు అమ్మ మొక్కగా నిలిచిపోతుం దని సూచించారు. ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో మొక్క నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వార్వల ఆంజిలయ్య, మాజి సర్పంచ్ జానకిరామ్ చౌహాన్,జిల్లా కార్యవర్గ సభ్యులు మహిపాల్,ప్రధాన కార్యదర్శి పి.వెంకటేష్,ఉపాధ్యక్షులు కొండ ఆంజనేయులు,మహేష, మల్లేష్, ఆజనేయులు,తదితరులు పాల్గొన్నారు.



అమ్మ పేరుతో మొక్కలు నాటుతున్న నేతలు

## పల్స్ పోలియో విజయవంతం చేయాలి

మండల వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్

**కుల్కచర్ల,జూన్ 22,ప్రభాతవార్త:** ఈ నెల 28 అదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్, ఎంపిడిఓ రామకృష్ణ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రం లోని ప్రాథమి ఆరోగ్య కేంద్రం అవరణలో వైద్య సిబ్బందితో సమవేశం నిర్వ హించి పలు సూచనాలు చేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ..0-5 సంవత్సరం చిన్న పిల్లలకు పల్స పోలీయో తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో వైద్య సిబ్బంది, ఎఎన్ ఎంలు, ఆశ కార్యకర్తలు తది తరులు పాల్గొన్నారు.



పల్స్ పోలియో సమావేశంలో మాట్లాడుతూన్న మండల వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్,

## ఉప సర్పంచ్‌ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**షాద్‌నగర్, జూన్ 22, ప్రభాతవార్త :** నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ



రూప సర్పంచ్ల సంఘం నియోజకవర్గ కమిటీ

పంచాయతీల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తాం అని షాద్‌నగర్ నియోజకవర్గ ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు "మల్కయ్యగారి గోవర్ధన్ రెడ్డి" స్పష్టం చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గ ఉప సర్పంచ్‌ల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫరూక్ నగర్ మండల అధ్యక్షుడు ముక్కుపోగుల ప్రకాష్ గౌడ్, కొందుర్గు మండల అధ్యక్షుడు చక్కని మహేష్ యాదవ్, కేశంపేట్ మండల అధ్యక్షుడు మహమ్మద్ షకీల్, కొత్తూరు మండల అధ్యక్షుడు మీసాల ఆరోగ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా శేరిగూడ ఉప సర్పంచ్ మల్కయ్య గారి గోవర్ధన్ రెడ్డిని (మధురాపూర్) షాద్‌నగర్ నియోజకవర్గ ఉప సర్పంచ్ల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎలుగని రాములు గౌడ్ (మక్తగూడ), ప్రధాన కార్యదర్శులుగా గుడ్డోల అభినవ్ (ఎల్లికట్ట), ఈసునాతి గంగాధర్ (హాజీపల్లి), కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా ఎల్. గోపాల్ రెడ్డి (శ్రీనివాసులుగూడ), ఉపాధ్యక్షులుగా యారం రామిరెడ్డి (సుందరాపురం), ఆవుల సిద్దయ్య యాదవ్ (నర్సప్పగూడ), వెంకటేష్ గౌడ్ (లక్ష్మీ మ్దేవునిపల్లి) ఎన్నికయ్యారు. అలాగే కార్యనిర్వాహణ కార్యదర్శులుగా పత్లావత్ లోక్య నాయక్ (మదలాపూర్), చీర లక్ష్మ మ్మయ్య (తాళ్లగూడ), కోశాధికారిగా సయ్యద్ జావిద్ (నేరెళ్లచెరువు), ప్రధాన సలహాదారులుగా కుంటల నరేష్ (భైరంపల్లి), సున్నాల గణేష్ (ఎస్‌బీ పల్లి) ఎన్నికయ్యారు.గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తాం ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మల్కయ్యగారి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఉప సర్పంచ్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం కృషి చేయడంతో పాటు గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని అన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా, గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ఉప సర్పంచ్ల పాత్రను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తూ ప్రజాసేవకు అంకితభావంతో సేవలందిస్తామని ఆయన స్పష్టం చేశారు. నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు ఉప సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యుత్ సమస్యలపై ఏడిఇకి వినతి పత్రం

**నందిగామ, జూన్ 22, ప్రభాతవార్త :** నందిగామ గ్రామపంచాయతీతో పాటు హామ్లెట్ గ్రామాలలో మరమ్మతు పనులను చేపట్టి, విద్యుత్ వెలుగులు అందించాలని సోమవారం సర్పంచ్ కొమ్ము కృష్ణ నేతృత్వంలో ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు నందిగామ ఏ డి ఈ రవీందర్ కు వినతి పత్రం అందజేశారు. చంద్రాయన్ గూడలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ మార్చాలని, 6 వ వార్డ్ లో 3 ఫేజ్ లైన్ కలపాలని,1 వ వార్డ్ లో అంగన్వాడి కేంద్రం వద్ద కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని, గాంధీ చౌక్ వద్ద అతుకుల, నాణ్యత లోపించిన వైర్లను తొలగించి సరి చేయాలని, నాణ్యత లభించిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు వేయాలని , ఇళ్లపై నుండి వెళ్లే విద్యుత్ లైన్ ద్వార ప్రమాదాలు జరగకుండా క్యాసారం ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారికి ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. స్పందించిన ఏడిఈ మాట్లాడుతూ వచ్చే బోనాల పర్వదినం లోగ అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ ఏఎంసి డైరెక్టర్ సి నర్సింలు,ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, శివగల్ల ప్రవీణ్, బొమ్మగళ్ళ నర్సింలు, టైలర్ కృష్ణ, చెరసాని నర్సింలు తదితరులు పాల్గొన్నారు.